PRGI NO: TGTEL/25/A2356

# మేకార్తి దినపత్రిక

జర్నలిస్టులకు ఆహ్వానం
నూతనంగా ప్రారంభించిన
మేకార్తి దినపత్రిక పత్రికలో
అన్ని జిల్లాలలో స్టాఫర్లుగా,మండలాల్లో విలేకర్లుగా పనిచేయుటకు
జర్నలిస్టులు కావలెను
సంప్రదించాల్సిన నెంబర్స్
9014726022,6302041083

శుక్రవారం
FRIDAY
19.09.2025

కరీంనగర్
KARIMNAGAR
పేజీలు : 4
pages : 4
సంపుటి :1 || సంచిక :17 || ధర : 4.00

త్రయోదశి

శుక్రవారం, సూర్యోదయం: 5-45, సూర్యాస్తమయం: 6-44. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం వసంత రుతువు వైశాఖ మాసం కృష్ణ పక్షం తిథి: ఏకాదశి రాత్రి 12-36 వరకు. నక్షత్రం: విశాఖ ఉదయం 9-09 వరకు, తదుపరి అనురాధ, వర్జ్యం: పగలు 1-34 నుంచి పగలు 3-20 వరకు, రాహుకాలం: పగలు 3-25 నుంచి సాయంత్రం 5-02 వరకు.దుర్ముహూర్తం: ఉదయం 8-20 నుంచి ఉదయం 9-12 వరకు, పునర్ దుర్ముహూర్తం: రాత్రి 11-05 నుంచి రాత్రి 11-50 వరకు.అమృతకాలం: రాత్రి 12-14 నుంచి రాత్రి 2-01 వరకు.

CIRCULATED AT: WARANGAL, HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA ,ADILABAD, NIZAMABAD, RANGAREDDY, MAHABUBNAGAR, MEDAK

WWW.MEKARTHI DINAPATRIKA.COM

# దమ్ముంటే జూబ్లీహిల్స్‌లో గెలిచి చూపించు



**హైదరాబాద్, మేకార్తి దినపత్రిక**

నేటి పేదోడి ప్రభుత్వం సంక్షేమ పథకాలు తెస్తుంటే.. కొంతమంది విషం కక్కుతున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. పాముకు కోరల్లో విషం ఉంటే, కొందరి నాయకులకు ఒళ్ళంతా విషం ఉంటుందని విమర్శించారు. ఎదులాపురం మున్సిపాలిటీ వరంగల్ క్రాస్ రోడ్డులో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ చేరికల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ వేదిక మీద నుంచి నాటి ప్రబుద్ధులను అడుగుతున్న.. ఇందిరమ్మ ఇళ్లు ఇస్తుంటే మీకు కడుపు మంట ఎందుకని ఆయన ప్రశ్నించారు. పేదోడికి ఇల్లు కట్టించి ఉంటే మీకు ఈ పరిస్థితి ఉండేది కాదని హితవు పలికారు. బీఆర్ఎస్‌కు మరోసారి ప్రజలు బుద్ధి చెప్తారు..

బీఆర్ఎస్ నాయకులకు ప్రజలు రెండు పర్యాయాలు బుద్ధి చెప్పారని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ప్రజలు బుద్ధి చెప్తారని పేర్కొన్నారు. వారి సోదరి, బిడ్డ సమస్యను సీఎం రేవంత్ రెడ్డికి అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మూడున్నర సంవత్సరాల తర్వాత జరిగే ఎన్నికల గురించి ట్విట్టర్ టిల్లు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. 'మీ పార్టీ శాసన సభ్యులు ఆరోగ్యం బాగాలేక చనిపోయారు. దానికి 15 రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ వస్తుంది. మీకు ఉన్న పరిజ్ఞానం, విజన్ గురించి నేను మాట్లాడను.. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో గెలిచి చూపించు' అని కేటీఆర్‌కు సవాల్ విసిరారు.

నువ్వెంత బచ్చా గాడివి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కేటీఆర్ మీద బచ్చా గాడిని పెట్టి గెలిపిస్తామని మంత్రి పొంగులేటి కీలక వ్యాఖ్యలు చేశారు. మూడున్నర సంవత్సరాల తర్వాత కేటీఆర్ ఇండియాలో ఉంటారో.. బ్యాగ్ సర్దుకుని విదేశాలకు వెళ్తారో చూడాలని ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నిక తర్వాత మీ పార్టీ స్థానం ఏంటో చూడు నాయన ట్విట్టర్ టిల్లు కేటీఆర్ అంటూ.. విమర్శించారు. మీ దయ దాక్షిణ్యాలతో ఎవరు బి ఫామ్ తీసుకోలేదని పేర్కొన్నారు. మీ నాయన మూడు సార్లు వచ్చి ముక్కు నేలకు రాసిన ఏమి చేయలేక పోయారని, నువ్వెంత బచ్చా గాడివి అని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అంటే ఆషామాషీ పార్టీ కాదన్నారు. ఇచ్చిన మాట కోసం నిలబడి, నెరవేర్చే పార్టీ అని ధీమా వ్యక్తం చేశారు. ఈ పార్టీలో ఏ ఒక్కరు తప్పు చేయరని ఉద్ఘాటించారు. తల కిందులగా తపస్సు చేసిన పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్ని సీట్లు వచ్చాయో.. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా అవే సీట్లు వస్తాయని మంత్రి పొంగులేటి ధ్వజమెత్తారు. కేటీఆర్ కామెంట్స్ తంతే.. గారెలబుట్టలో పడినట్టు లక్కీలాటరీలో మంత్రి అయిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మళ్లీ పాలేరులో ఎలా గెలుస్తారో చూద్దామని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. మంగళవారం తెలంగాణభవన్‌లో భద్రాచలం నియోజకవర్గ ముఖ్యకార్యకర్తల భేటీలో పొంగులేటిపై కామెంట్స్ చేశారు. ఏడాది క్రితం పొంగులేటి ఇంటిపై జరిగిన ఈడీ దాడుల్లో దొరికిన డబ్బు గురించి కేంద్రంగానీ, ఆయనగానీ ఎందుకు మాట్లాడటంలేదని ప్రశ్నించారు. 'పొంగులేటి బీజేపీతో కుమ్మక్కయ్యారా? బీజేపీతో కుమ్మక్కైన రేవంత్‌రెడ్డితో పొంగులేటి కలిసిపోయారా..?' అని నిలదీశారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ మాటలకు ఇవాళ(గురువారం) మంత్రి పొంగులేటి బదులిచ్చారు.

# బ్రిటిష్ హైకమిషనర్‌తో సీఎం భేటీ



హైదరాబాద్, సెప్టెంబర్ :

భారత బ్రిటిష్ హైకమిషనర్ లిండీ కామెరాన్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ( జూబ్లీహిల్స్ నివాసంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా యూకే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే చెవెనింగ్ స్కాలర్ షిప్ కో-ఫండింగ్ ప్రాతిపదికన తెలంగాణ మెరిట్ విద్యార్థులకు ఇచ్చేందుకు లిండీ కామెరాన్ అంగీకరించారు. ఎడ్యుకేషన్, టెక్నాలజీ సంబంధిత రంగాల్లో సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ముఖ్యమంత్రికి బ్రిటిష్ హైకమిషనర్ వివరించారు.

యూకే యూనివర్సిటీలలో చదువుకునే తెలంగాణ విద్యార్థుల సౌకర్యార్థం హైదరాబాద్ నుంచి అక్కడి యూనివర్సిటీలు ఆపరేట్ చేసేలా చూడాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ సందర్భంగా తెలంగాణలో తీసుకురాబోతున్న కొత్త ఎడ్యుకేషన్ పాలసీ డ్రాఫ్ట్‌ను కూడా బ్రిటిష్ హైకమిషనర్‌కు సీఎం రేవంత్ వివరించారు.

రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లకు ట్రైనింగ్ అందించేందుకు బ్రిటిష్ హైకమిషనర్ సుముఖత వ్యక్తం చేశారు. మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధిలో బ్రిటీష్ కంపెనీలు భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి కోరారు. జీసీసీ, ఫార్మా, నాలెడ్జ్, అకాడమీ విభాగాల్లో పెట్టుబడులకు ముందుకు రావాలని సీఎం కోరగా.. అందుకు బ్రిటీష్ హైకమిషనర్ సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశానికి డిప్యూటీ హైకమిషనర్ హైదరాబాద్ గారెత్ విన్ ఓవెన్ పొలిటికల్ ఎకానమి అడ్వైజర్ నళిని రఘురామన్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి హాజరయ్యారు.

# అదంతా ఫేక్ ఆ వార్తలను ఖండిస్తున్నా



**మేకార్తి దినపత్రిక నల్లగొండ, సెప్టెంబర్:**

తన ఇమేజ్ దెబ్బతీసేలా ఆంధ్రజ్యోతి పేరుతో ఫేక్ ప్రచారం చేశారని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. 'ఆంధ్రజ్యోతి పేపర్‌ను తలపించేలా అందజ్యోతి అనే పేరుతో పేపర్ ప్రింట్ చేసి.. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి లేదన్న రాజగోపాల్ రెడ్డి అనే శీర్షికను నేను అనని మాటలు అన్నట్లు ప్రచురించారు' అంటూ ఫైర్ అయ్యారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి గురించి అసెంబ్లీలో ప్రస్తావించిందే తానన్నారు. తనకు మంత్రి పదవి రానందుకే సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వంపై తాను అనని మాటలను అన్నట్టు తప్పుడు కథనాలను సృష్టించి అబద్ధాలను ప్రచారం చేస్తున్నారన్నారు. 'నా పైన వచ్చే తప్పుడు వార్తలు, అబద్ధాలను తీవ్రంగా ఖండిస్తున్నా. కాంగ్రెస్ పార్టీలో ఒకసారి ఎంపీ, ఎమ్మెల్సీ, రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన నాకు కాంగ్రెస్ పార్టీ అన్నా సోనియా గాంధీ, రాహుల్ గాంధీ అన్నా ఎంతో అభిమానం. మా కుటుంబమే కాంగ్రెస్ పార్టీ నేపథ్యం. నేను రాజీనామా చేస్తున్నానని, పార్టీ మారుతున్నానని, పార్టీ పెడుతున్నానని తప్పుడు వార్తలు రాస్తున్నారు. కొందరు గిట్టని వ్యక్తులు నా ప్రతిష్ట దెబ్బతీయడానికి సోషల్ మీడియా ద్వారా అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారు' అంటూ మండిపడ్డారు. ఆర్ఆర్ఆర్ అలైన్మెంట్ విషయంలో కొంతమంది అనుకూల ంగా మార్చుకున్నారని అనుమానా లు ఉన్నాయన్నారు. భూ నిర్వాసితుల విషయంలో తగిన పరిహారం ఇచ్చి న్యాయం చేస్తే బాగుంటుందని తనఅభిప్రాయం చెప్పినట్లు తెలిపా రు.ఈరోజు తాను గుంటూరులో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి వెళ్తుంటే మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిని కలవడానికి వెళ్తున్నానని పుకార్లు సృష్టిస్తున్నారని.. గుంటూరుకు వెళ్లిన తర్వాత అటు నుంచి విజయవాడ వెళ్లి అమ్మవారి దర్శనం చేసుకొని వద్దామని వెళ్తున్నట్లు స్పష్టం చేశారు. నా రాజకీయ భవిష్యత్తు గురించి నేనే మీడియా సమావేశంలో వెల్లడిస్తాను.అప్పటివరకు ఈ దుష్ప్రచా రాలను నమ్మొద్దు' అంటూ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

## హైదరాబాద్‌లో దంచికొడుతున్న భారీ వర్షం



**హైదరాబాద్, మేకార్తి దినపత్రిక**

నగరంలో మరోసారి భారీ వర్షం కురుస్తోంది. ఉన్నట్టుండి ఒక్కసారిగా వర్షం దంచికొట్టడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యార్థులు, ఉద్యోగులు ఇళ్లకు వెళ్లే సమయం కావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్, యూసుఫ్‌గూడ, అమీర్‌పేట్, పంజాగుట్ట, మాదాపూర్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. ఐటీ కారిడార్‌తో పాటు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

మరికొన్ని గంటలపాటు వర్షం కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని %+నవీజ% అధికారులు విజ్ఞప్తి చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వర్షపు నీరు ఇళ్లలోకి వచ్చేందుకు అవకాశముండడంతో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# ఓ వైపు ఐటీ మరోవైపు ఈడీ

## హైదరాబాద్‌లో వరుస సోదాలు




**హైదరాబాద్, సెప్టెంబర్ మేకార్తి దినపత్రిక**

నగరంలో రెండో రోజు ఐటీ అధికారుల సోదాలు కొనసాగుతున్నాయి. వాసవి గ్రూప్ తోపాటు, కలాసా జ్యువెలరీ, క్యాప్స్ గోల్డ్ సంస్థలు ఐదేళ్లలో చెల్లించిన పన్నులపై అధికారు ఆరా తీస్తున్నారు. క్యాప్స్ గోల్డ్ కంపెనీ డైరెక్టర్ చందా శ్రీనివాసరావు కుటుంబ సభ్యుల ఇళ్లలో ఐటీ సోదాలు కొనసాగుతున్నాయి. చందా కుటుంబ సభ్యులు, డైరెక్టర్లుగా ఉన్న పలు కంపెనీల్లో కీలక ఆధారాలను ఐటీ అధికారులు సేకరించారు.

హైదరాబాద్‌తో పాటు వరంగల్లోనూ ఐటీ దాడులు జరుగుతున్నాయి. చందా శ్రీనివాసరావుతో పాటు, చందా అభిషేక్, చందా సుధీర్ నివాసాల్లోను ఐటీ అధికారులు తనిఖీలు కొనసాగిస్తున్నారు. అటు వాసవి బిల్డర్స్‌పై కూడా ఐటీ సోదాలు జరుగుతున్నాయి. నిన్నటి నుంచి వాసవి ఆఫీస్, వాసవి చైర్మెన్ విజయ్ కుమార్ యర్రం ఇంట్లో సోదాలు కొనసాగుతున్నాయి. రాత్రి అంతా వాసవి ఆఫీస్‌లోనే ఐటీ అధికారులు ఉండి మరీ సోదాలు నిర్వహించారు.

ఈడీ సోదాలు.. కీలక పత్రాలు స్వాధీనం

మరోవైపు సికింద్రాబాద్‌లోని వెస్ట్ మారేడుపల్లిలో ఈడీ సోదాలు జరుగుతున్నాయి. వెల్లింగ్టన్ ఎంక్లేవ్‌లో ఉన్న వ్యాపారవేత్త బూరుగు రమేష్, అతని కుమారుడు విక్రాంత్ నివాసాలపై ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. సోదాల్లో పలు కీలక పత్రాలను ఈడీ స్వాధీనం చేసుకుంది. కాస్పో లీగల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, మహాదేవ జ్యూవెలర్స్‌తో పాటు రాజశ్రీ ఫుడ్స్‌లో బూరుగు విక్రాంత్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. మహాదేవ జ్యూవెలర్స్‌లో బంగారం కొనుగోలు, అమ్మకాల్లో అవకతవకలు జరిగినట్లు ఈడీ గుర్తించింది. మహాదేవ్ జ్యూవెలర్స్ తోపాటు మరికొన్ని కంపనీలకు కూడా డైరెక్టర్‌గా ఉన్నారు విక్రాంత్. ఈ క్రమంలో మనీ లాండరింగ్ , ఫెమా నిబంధనలు ఉల్లగించినట్లు ఈడీ గుర్తించింది. ఈరోజు రాత్రి వరకు ఈడీ సోదాలు కొనసాగనున్నాయి.

# లోకల్ అభ్యర్థిత్వ వివాదంపై

## తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు




**హైదరాబాద్, మేకార్తి దినపత్రిక**

ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్లలో లోకల్ అభ్యర్థి గుర్తింపు వివాదాన్ని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. వనపర్తి జిల్లా విద్యార్థి శశికిరణ్ పిటిషన్‌పై తీర్పు వెల్లడించింది న్యాయస్థానం. ఆంధ్రప్రదేశ్ సైనిక్ స్కూల్‌లో చదివినా తనను తెలంగాణ కోటా కింద పరిగణించాలని హైకోర్టు స్పష్టంచేసింది.అడ్వకేట్ జనరల్ సమాధానంతో కేసు ముగించింది. విద్యార్థికి వెబ్ ఆప్షన్ ఇచ్చేలా,కౌన్సెలింగ్‌కు పిలవాలని హైకోర్టు సూచించింది.సైనిక్ స్కూల్‌లోచదివిన తెలంగాణ విద్యార్థులకు పదేళ్లవరకు రాయితీ కొనసాగించాలని ఆదేశించింది.అనంతరం పిటిషన్ డిస్పోజ్ చేసింది తెలంగాణ హైకోర్టు.

# కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే విద్య, వైద్యానికి పెద్దపీట

**హైదరాబాద్, మేకార్తి దినపత్రిక**



కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే విద్య, వైద్యానికి పెద్దపీట వేశారని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బుధవారం జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపేట్, పహాడిషరీఫ్‌లోని పలు ప్రభుత్వ పాఠశాలలను ఆమె పరిశీలించారు. ఎర్ర కుంట, జల్‌పల్లి, కమాన్‌వద్ద అర్బన్ హెల్త్‌పోస్ట్ ఆస్పత్రికి స్థలాలను పరిశీలించారు. ఈసందర్భంగా సబితా ఇంద్రారెడ్డి, మాట్లాడుతూ, పాఠశాలలో నెల కొన్న సమస్యలపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్న సంకల్పంతో గురుకులాలను ఏర్పాటు చేశారన్నారు. మన ఊరు మన బడి ద్వార ప్రభుత్వం పాఠశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. మైనార్టీల కోసం 200మైనార్టీ గురుకులాలను ఏర్పాటు చేశారన్నారు. పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు.

# రాంగోపాల్ వర్మపై కేసు నమోదు



హైదరాబాద్, సెప్టెంబర్ : **మేకార్తి దినపత్రిక**

సంచలన దర్శకుడు రాంగోపాల్ వర్మపై కేసు నమోదు అయ్యింది. రిటైర్డ్ ఐపీఎస్ అంజనా సిన్హా ఇచ్చిన ఫిర్యాదుతో రాయదుర్గంలో రాంగోపాల్ వర్మపై పోలీసులు కేసు నమోదు చేశారు. దహనం వెబ్ సిరీస్ అంశంలో ఆర్జీవీపై అంజనాసిన్హా పోలీసులకు ఫిర్యాదు చేశారు. మావోయిస్టులపై తీసిన వెబ్ సిరీస్‌లో అంజనాసిన్హా పేరు ప్రస్తావించారు. అంజనాసిన్హా చెప్పిన విధంగా కొన్ని సీన్లు తీసినట్లు ఆర్జీవీ చెప్పుకొచ్చారు. దీనిపై రిటైర్డ్ ఐపీఎస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తన ప్రమేయం లేకుండా పేరు వాడినందుకు ఆర్జీవీపై రిటైర్డ్ ఐపీఎస్ అంజనా సిన్హా ఫిర్యాదు చేశారు.

# జాతీయం

## రాహుల్ ఆరోపణలు స్పందించిన బీజేపీ




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ , మేకార్తి దినపత్రిక :**

ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. రాహుల్ ఆరోపణలకు మాజీ కేంద్రమంత్రి, బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ప్రెస్‌మీట్ పెట్టి మరీ రాహుల్ ఆరోపణలు తోసిపుచ్చారు. ఎన్నికల్లో ఓడిపోయి.. ప్రజల చేత పదే పదే తిరస్కరించబడిన నేత రాహుల్ గాంధీ అని ఎంపీ అనురాగ్ ఠాకూర్ సెటైర్లు వేశారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ దాదాపు 90 ఎన్నికల్లో ఓడిపోయిందని పేర్కొన్నారు.


కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ)పై లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ఎంపీ రాహుల్ గాంధీ వరుసగా ఆరోపణలు చేస్తున్నారు. ఆ క్రమంలో సీఈసీపై గురువారం సైతం రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ఈ నేపథ్యంలో బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ న్యూఢిల్లీలో స్పందించారు. రాహుల్ గాంధీలో నిరాశ నిరంతరం పెరుగుతోందన్నారు. రాజకీయ ఆరోపణలను తన ఆభరణంగా రాహుల్ మార్చుకున్నారని వ్యాఖ్యానించారు. సీఈసీపై చేసిన ఆరోపణలను నిరూపించమని ప్రశ్నించమన్నప్పుడల్లా.. ఆయన వెనుదిరిగి పారిపోతున్నారంటూ ఎద్దేవా చేశారు. ఆరోపణల నేపథ్యంలో అఫిడవిట్ ఇవ్వమని అడిగితే.. రాహుల్ వెనక్కి తగ్గుతారన్నారు. రాఫెల్, చౌకీదార్ చోర్ పై నిరాధారమైన ఆరోపణలు చేయడం అలవాటుగా మారిందంటూ రాహుల్ గాంధీపై బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ నిప్పులు చెరిగారు. పదే పదే తప్పుడు వాదనలు చేసి.. చివరకు క్షమాపణలు చెబుతారంటూ రాహుల్ వ్యవహార శైలిని ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ ఎండగట్టారు.

ఇంతకీ ఏం జరిగిందంటే..

కేంద్ర ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి ఆరోపణలు గుప్పించారు. గురువారం న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. 2023 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీకి పట్టున్న ప్రాంతాల్లో ఓట్లను తొలగించారని విమర్శించారు. నకిలీ లాగిన్లు, ఫోన్ నెంబర్లు వినియోగించి ఓటర్ ఐడీలను తొలగించారని ఆరోపించారు.

ఈ ప్రక్రియ రాష్ట్రం వెలుపల నుంచి సాగిందని తెలిపారు. ఈ ఓట్ల తొలగింపు ప్రక్రియను ప్రత్యేక సాఫ్ట్‌వేర్ వినియోగించి చేస్తున్నారన్నారు. ఇదంతా ప్రతిపక్ష పార్టీలకు ఓట్లు వేసే వారిని లక్ష్యంగా చేసుకుని జరుగుతుందంటూ రాహుల్ గాంధీ మండిపడ్డారు. ఈ నేపథ్యంలో రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ పై విధంగా స్పందించారు.

## శరత్‌కుమార్ సంచలన కామెంట్స్




**మేకార్తి దినపత్రిక , చెన్నై:**

తన సభలకు కూడా జనం భారీగా హాజరయ్యేవారని బీజేపీ నేత శరత్‌కుమార్ వ్యాఖ్యానించారు. తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ చేపట్టిన ప్రచారానికి లక్షలాది మంది తరలిరావడంపై పలు పార్టీల నేతలు వివిధ రకాలుగా స్పందిస్తున్నారు. ఈ వ్యవహారంపై శరత్‌కుమార్ స్పందిస్తూ... 1996లో 'నాట్టామై', 'సూర్యవంశం' తదితర విజయవంతమైన చిత్రాల అనంతరం తాను రాజకీయాల్లోకి వచ్చానని, పదవీవిరమణ అనంతరం రాజకీయాల్లోకి రాలేదన్నారు.

మదురైలో తాను నిర్వహించిన సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారని, అప్పటి వీడియో దృశ్యాలు కావాలంటే పరిశీలించవచ్చన్నారు. ఏ పార్టీ సభకైనా ప్రజలు పెద్దసంఖ్యలో వస్తారని, విజయ్‌కు సిద్ధాంతం, లక్ష్యం లేవని, ప్రతిపక్ష రాజకీయాలు మాత్రమే చేస్తున్నారని శరత్‌కుమార్ విమర్శించారు.

## జెండా స్తంభాల తొలగింపు భేష్




**మేకార్తి దినపత్రిక చెన్నై:**

జెండా స్తంభాల తొలగింపులో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను మద్రాసు హైకోర్టు(%మీఖుఎతీుం ఎఅస్త్రత్ర జశీబతీ%) ప్రశంసించింది. రాష్ట్రవ్యాప్తంగా రద్దీ ప్రాంతాలు, జాతీయ, రాష్ట్ర రహదారుల పక్కన, ప్రైవేటు స్థలాల్లో రాజకీయ పార్టీలు, మత, కుల సంఘాలు ఏర్పాటుచేసిన జెండా స్తంభాలు తొలగించాలని హైకోర్టు మదురై ధర్మాసనం జనవరిలో ఉత్తర్వులు జారీచేసిన విషం తెలిసిందే. ఈ వ్యవహారానికి సంబంధించిన పిటిషన్‌పై బుధవారం న్యాయమూర్తి జస్టిస్ ఇళందిరయన్ తిరిగి విచారణ చేపట్టారు.

ఈ సందర్భంగా తాము చేపట్టిన చర్యలపై చెన్నై, తిరువళ్లూర్, చెంగల్పట్టు, కాంచీపురం జిల్లాల కలెక్టర్లు నేరుగా హాజరై నివేదికలను సమర్పించారు. జెండా స్తంభాల ఏర్పాటుకు సంబంధించిన అనుమతులిచ్చేందుకు మండల, జిల్లా స్థాయిలో కమిటీ ఏర్పాటుచేశామని, దీనికి సంబంధించి జీవో కూడా ఇచ్చామని రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది రవీంద్రన్ వివరించారు. అంతేగాక రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు నిర్వహించే సభలు, కార్యక్రమాలకు రోడ్డు మధ్యలో ఉన్న సెంటర్ మీడియాలో జెండా స్తంభాలు ఏర్పాటుచేయరాదని,

%మూడు రోజుల కంటే ఎక్కువగా స్తంభాలు ఉంచరాదని కూడా నిర్దేశించామని వివరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ చర్యల్ని న్యాయమూర్తి అభినందించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు పాటించాలని స్పష్టం చేశారు. అలాగే, ఈ మార్గదర్శకాలు అమలుచేయని అధికారులపై కోర్టు ధిక్కరణ చర్యలు చేపడతామని హెచ్చరించిన న్యాయమూర్తి.. తదుపరి విచారణ అక్టోబరు 15వ తేదీకి వాయిదావేశారు.

# బోయింగ్, హనీవెల్‌పై

## ఎయిర్ ఇండియా ప్రయాణికుల ఫ్యామిలీ న్యాయ పోరాటం

**అహ్మదాబాద్, మేకార్తి దినపత్రిక**

అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా ఫ్లైట్ 171 విమాన ప్రమాదంలో 260 మంది ప్రాణాలు కోల్పోయిన దుర్ఘటన అందరికీ తెలిసిందే. ఈ దుర్ఘటనలో మరణించిన నలుగురు ప్రయాణికుల కుటుంబాలు అమెరికాలోని డెలావేర్ సుపీరియర్ కోర్టులో బోయింగ్, హనీవెల్ కంపెనీలపై దావా వేశాయి . ఈ కంపెనీల నిర్లక్ష్యం, లోప భూయిష్ట ఫ్యూయల్ కటాఫ్ స్విచ్ కారణంగానే ఈ విషాదం సంభవించిందని ఆరోపిస్తున్నారు.

బుధవారం దాఖలైన ఈ ఫిర్యాదు ప్రకారం, బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ విమానంలో ఉన్న ఫ్యూయల్ కటాఫ్ స్విచ్‌ను బోయింగ్ సంస్థ ఏర్పాటు చేసింది. అయితే దాన్ని తయారు చేసిన హనీవెల్ కంపెనీ ఈ లోపానికి బాధ్యత వహించాలని ఫిర్యాదు తెలిపింది. స్విచ్‌లోని లాకింగ్ మెకానిజం సరిగ్గా పనిచేయకపోవడం, అది సులభంగా తొలగిపోయే అవకాశం ఉండటం వల్ల ఇంధన సరఫరా నిలిచిపోయింది. దీంతో టేకాఫ్ సమయంలో అవసరమైన థ్రస్ట్ లభించలేదని ఫిర్యాదుదారులు చెబుతున్నారు. చర్యలు తీసుకోలేదని..

2018లో యూఎస్ ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ బోయింగ్ విమానాల్లోని స్విచ్‌ల లాకింగ్ మెకానిజంలో సమస్య ఉందని చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. ఈ కంపెనీలు దాన్ని సరిచేయడానికి తగిన చర్యలు తీసుకోలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. థ్రస్ట్ లివర్ల వెనుక ఈ స్విచ్‌లను ఏర్పాటు చేయడం వల్ల, కాక్‌పిట్‌లో సాధారణ కార్యకలాపాల సమయంలో స్విచ్ ఆన్ లేదా ఆఫ్ అయ్యే ప్రమాదం ఉందని వారు ఆరోపిస్తున్నారు.



దావా లక్ష్యం

ఈ దావాలో కాంతాబెన్ ధీరూభాయ్ పఘడాల్, నావ్య చిరాగ్ పఘడాల్, కుబేర్‌భాయ్ పటేల్, బబీబెన్ పటేల్‌ల మరణాలకు నష్టపరిహారం కోరుతున్నారు. ఈ నలుగురు 229 మంది ప్రయాణికులతో పాటు మరణించారు. వారి కుటుంబ సభ్యులు భారత్, బ్రిటన్ పౌరులని తెలుస్తోంది. ఈ విమాన ప్రమాదంపై అమెరికాలో దాఖలైన మొదటి దావా ఇదేనని భావిస్తున్నారు. అయితే నష్టపరిహారం ఎంత మొత్తం అనేది స్పష్టంగా తెలియలేదు.

తాత్కాలిక నివేదిక

భారత్, యూకే, యునైటెడ్ స్టేట్స్ అధికారులు ఈ ప్రమాదానికి కచ్చితమైన కారణాన్ని ఇంకా నిర్ధారించలేదు. భారతదేశ ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో జులైలో విడుదల చేసిన తాత్కాలిక నివేదిక ప్రకారం, టేకాఫ్ సమయంలో రెండు ఫ్యూయల్ కంట్రోల్ స్విచ్‌లు కటాఫ్ స్థానానికి మారాయి. దీనివల్ల ఇంజన్లకు ఇంధన సరఫరా ఆగిపోయింది. 10 సెకన్లలో స్విచ్‌లను మళ్లీ రన్ స్థానానికి మార్చినప్పటికీ, ఇంజన్లు సకాలంలో థ్రస్ట్‌ను తిరిగి పొందలేకపోయాయి.

కాక్‌పిట్ వాయిస్ రికార్డింగ్‌లో ఒక పైలట్ మరొకరిని ఫ్యూయల్ స్విచ్ గురించి అడిగిన సంభాషణ రికార్డ్ అయింది. రెండో పైలట్ దాన్ని తాను ఆపరేట్ చేయలేదని చెప్పారు. ఈ క్రమంలో సమాచార లోపం లేదా సిస్టమ్ సమస్య వల్ల మారాయా అని %ఖూూ×దీ% పరిశీలిస్తోంది. ఈ దావా బోయింగ్, హనీవెల్ కంపెనీల బాధ్యతను ప్రశ్నిస్తూ, విమాన భద్రతా ప్రమాణాలపై మరోసారి చర్చను రేకెత్తిస్తోంది.

## రోగివేషంలో ఆస్పత్రికి జిల్లా కలెక్టర్




**మేకార్తి దినపత్రిక చెన్నై:**


ఎరంబలూరు జిల్లా గోల్కానత్తం ప్రాథమిక కేంద్రానికి సాధారణ రోగి వేషంలో వెళ్లిన జిల్లా కలెక్టర్ మృణాళిని అక్కడ ప్రజలకు ఏవిధంగా వైద్యం అందుతుందో పరిశీలించారు. ఇటీవల గోల్కానత్తం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కు.ని శస్త్రచికిత్స చేయించుకున్న ఓ మహిళ..ఆస్పత్రిలో చికిత్స సరిగ్గా లేదంటూ జిల్లా కలెక్టర్‌కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేసింది. దీంతో, ఘటన జరిగిన రోజు సాయంత్రం సాధారణ రోగి వేషంలో కలెక్టర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లారు.

తనకు ఆరోగ్యం సరిగా లేదని ఆస్పత్రిలో ఉన్న నర్సుకు చెప్పగా, నర్సు ఎలాంటి పరీక్ష చేయకుండానే ఇంజక్షన్ వేసేందుకు సిద్ధమైంది. దాంతో అప్రమత్తమైన కలెక్టర్ ఇక్కడ డాక్టర్లు ఎవరూ లేరా? వారు రోగులను చూడరా అంటూ ప్రశ్నించారు. అప్పటికి ఆమెను కలెక్టర్‌గా గ్రహించిన నర్సు వణికిపోయింది. ఆ కేకలు విని ఆస్పత్రి సిబ్బంది కూడా అక్కడికి చేరుకున్నారు. డాక్టర్ గురించి ఆరా తీయగా అందరూ నీళ్లు నమిలారే తప్ప ఒక్కరు కూడా సమాధానం చెప్పలేకపోయారు. దీంతో రిజిస్టర్ పరిశీలించిన కలెక్టర్ దానిని సక్రమంగా నిర్వహించడం లేదని తెలుసుకున్నారు. రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన నర్సుపైనా, విధులకు గైర్హాజరైన వైద్యుడిపైనా శాఖాపరమైన చర్యలకు ఆదేశించారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో బాగా వైరల్ అవుతోంది.

## అధికారంలో భాగస్వామ్యం కావాలని రాహుల్ కోరలేదు

**మేకార్తి దినపత్రిక చెన్నై:**

రాష్ట్రంలో అధికార భాగస్వామ్యం పొందాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఎప్పుడూ చెప్పలేదని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై పేర్కొన్నారు. బుధవారం పెరియార్ జయంతి సందర్భంగా నగరంలోని సిమ్సన్ జంక్షన్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ఎక్కువ స్థానాల్లో పోటీ చేయాలనే కోరుకుంటోందని ప్రతి ఎన్నికల్లోనూ సీట్లు పెంచాలని మాత్రమే కూటమికి నేతృత్వం వహిస్తున్న డీఎంకేను డిమాండ్ చేస్తోందన్నారు. అదే సమయలో అధికారంలో భాగస్వామం కావాలని కాంగ్రెస్ నాయకులెవరూ కోరలేదని స్పష్టం చేశారు. జయలలిత మృతి



తర్వాత అన్నాడీఎంకే ప్రభుత్వాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే కాపాడిందంటూ ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి చెప్పడం చూస్తుంటే అన్నాడీఎంకే నేతలంతా బీజేపీకి బానిసలుగా వ్యవహరించారని స్పష్టమవుతోందని సెల్వపెరుంతగై ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌సీసీ నేతలు ఎస్.తిరునావుక్కరసర్, కేవీ తంగబాలు పాల్గొన్నారు.

## పాక్-సౌదీ ఒప్పందంతో కలిగే పర్యవసానాలను పరిశీలిస్తున్నాం

**ఇంటర్నెట్ డెస్క్: మేకార్తి దినపత్రిక**

పాకిస్థాన్, సౌదీ అరేబియా దేశాల మధ్య తాజాగా కుదిరిన సమగ్ర వ్యూహాత్మక రక్షణ ఒప్పందంపై భారత్ స్పందించింది. ఈ ఒప్పందం వల్ల కలిగే పర్యవసానాలనునిశితంగా పరిశీలిస్తున్నామని విదేశాంగ శాఖ ప్రతినిధి తాజాగా పేర్కొన్నారు. పాక్, సౌదీల్లో ఏ ఒక్క దేశంపై దాడి జరిగినా ఇరువురిపై దాడిగా పరిగణించేలా ఈ ఒప్పందం కుదుర్చుకున్న విషయం తెలిసిందే తాజా పరిణామాలు తమ దృష్టికి వచ్చాయని విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ తాజాగా పేర్కొన్నారు. అంతర్జాతీయ, ప్రాంతీయ సుస్థిరతలపై ఈ ఒప్పందం పర్యవసానాలను నిశితంగా పరిశీలిస్తున్నామని అన్నారు. దేశ ప్రయోజనాల పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని అన్నారు. అన్ని కోణాల్లో జాతీయ ప్రయోజనాలను కాపాడుకుంటామని తెలిపారు స్ట్రాటజిక్ మ్యూచువల్



డిఫెన్స్ అగ్రిమెంట్ పేరిట ఇరు దేశాలు ఈ రక్షణ ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. పాక్ ప్రధాని షహబాస్ షరీఫ్ సౌదీ పర్యటన సందర్భంగా సౌదీ క్రౌన్స్ ప్రిన్స్ మొహమ్మద్ బిన్ సల్మాన్ ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇటీవల హమాస్ నేతలను టార్గెట్ చేస్తూ ఖతర్‌పై ఇజ్రాయెల్ దాడి చేసిన నేపథ్యంలో సౌదీ, పాక్ మధ్య ఈ ఒప్పందం కుదరడం గమనార్హం. అయితే, ఈ దాడులను అమెరికా స్వయంగా తప్పుబట్టింది. అమెరికాతో పాటు ఇజ్రాయెల్ జాతీయ ప్రయోజనాలకు ఇది విఘాతమని పేర్కొంది.

# అంతర్జాతీయం

## అమెరికా చట్టసభల భవనం ఎదురుగా ట్రంప్ బంగారు విగ్రహం




**మేకార్తి దినపత్రిక : ఇంటర్నెట్ డెస్క్:**

అమెరికా చట్టసభల భవనం క్యాపిటల్ ఎదురుగా ట్రంప్ బంగారు విగ్రహం ఏర్పాటుపై ప్రస్తుతం సర్వత్రా ఆసక్తి రేగుతోంది. కొందరు ఈ చర్యపై విమర్శలు కూడా గుప్పిస్తున్నారు .జాతీయ మీడియా కథనాల ప్రకారం, ట్రంప్ చేతిలో క్రిప్టో కరెన్సీ ఉన్నట్టు 12 అడుగుల ఎత్తు ఉండేలా ఈ విగ్రహాన్ని డిజైన్ చేశారు. దీని కోసం క్రిప్టోకరెన్సీ పెట్టుబడిదారులు నిధులు సమకూర్చారు. అమెరికా ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేటును 25 బేస్ పాయింట్ల మేర తగ్గించిన నేపథ్యంలో విగ్రహం ఏర్పాటు ఆసక్తికరంగా మారింది. దీన్ని చూసేందుకు జనాలు తండోపతండాలుగా తరలివస్తున్నారు డిజిటల్ కరెన్సీ భవిష్యత్తు, రిజర్వ్ బ్యాంకుల విత్త విధానాలు, ఆర్థిక రంగ మార్కెట్‌లో ప్రభుత్వం పాత్ర తదితర అంశాలపై జనాల్లో అవగాహన, చర్చను ప్రారంభించేందుకు ఈ విగ్రహం ఏర్పాటు చేసినట్టు క్రిప్టో ఇన్వెస్టర్లు కొందరు పేర్కొన్నారు. ఈ విగ్రహం చిత్రాలు సోషల్ మీడియాలో కూడా వైరల్ అవుతున్నాయి. క్రిప్టో అనుకూల విధానాలను అవలంబిస్తున్న ట్రంప్‌ను కొందరు ప్రశంసించారు ఇక వడ్డీ రేట్లల్లో కొత పెట్టాలంటూ అమెరికా ఫెడరల్ రిజర్వ్‌పై ట్రంప్ ఎప్పటి నుంచో ఒత్తిడి తెస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లో కోత విధించింది. మరో రెండు పర్యాయాలు వడ్డీ రేటును తగ్గించే యోచనలో ఉన్నట్టు కూడా పేర్కొంది. ద్రవ్యోల్బణం కట్టడికి ప్రాధాన్యమిస్తూ వచ్చిన ఫెడరల్ రిజర్వ్ ఇకపై తన దృష్టిని ఉద్యోగాల పెంపుపై మళ్లించినట్టు వెల్లడించింది. అమెరికాలో ఓవైపు ద్రవ్యోల్బణం పెరుగుతుంటే మరోవైపు ఉద్యోగాల సృష్టి రేటు కూడా నెమ్మదిస్తోందని ఫెడరల్ రిజర్వ్ పేర్కొంది. ఈ నేపథ్యంలో ట్రంప్ రెస్పాన్స్ ఎలా ఉంటుందన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## అమెరికాలో జిమ్మీ కిమ్మెల్ లైవ్ షో నిలిపివేత



**మేకార్తి దినపత్రిక , ఇంటర్నెట్ డెస్క్:**

అమెరికాలో మరో పాప్యులర్ టాక్ షోపై వేటు పడింది. జిమ్మీ కిమ్మెల్ వ్యాఖ్యాతగా ఉన్న టాక్ షోను నిలిపివేస్తున్నట్టు ఏబీసీ టీవీ సంస్థ తాజాగా పేర్కొంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సన్నిహితుడు చార్లీ కిర్క్ హత్యోదంతంపై వ్యాఖ్యాత జిమ్మీ కిమ్మెల్ అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినందుకుషోను నిలిపివేస్తున్నట్టు వెల్లడించింది ఏబీసీ నిర్ణయంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హర్షం వ్యక్తం చేశారు. ఇది అమెరికాకు ఒక శుభవార్తఅని కామెంట్ చేశారు సెప్టెంబర్ 10న కిర్క్ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ అంశంపై తన పాప్యులర్ లేట్ నైట్ షోలో కిమ్మెల్ మాట్లాడారు. కిర్క్ హత్య నుంచి రాజకీయ లబ్ధి పొందే ందుకు రిపబ్లికన్లు ప్రయత్నిస్తున్నారని అన్నారు. కిర్క్‌ను హత్య చేసిన వ్యక్తి. ట్రంప్ మద్దతుదారులైన మాగా గ్యాంగ్‌కు చెందిన వాడేఅనిఅన్నారుర్క్ విషయంలో ట్రంప్ సంఘీ భావంప్రకటించిన తీరును కూడా కిమ్మెల్ విమర్శించారు. ట్రంప్ సంఘీభావ ప్రకటన వీడియోను తన షోలో చూపించారు. ఓవైపు సంఘీభావం ప్రకటిస్తూనే మరోవైపు ట్రంప్ శ్వేతసౌధంలో కొత్తగా చేపడుతున్న నిర్మాణాల గురించి మాట్లాడినట్టు వీడియోలో కనిపించింది. దీన్ని ప్రస్తావిస్తూ కిమ్మెల్ విమర్శలు ఎక్కుపెట్టారు. మరో ఛానల్‌లో కూడా ట్రంప్ కిర్క్ హత్య గురించి మాట్లాడుతూ శ్వేత సౌధంబాల్ రూమ్ నిర్మాణం గురించి ప్రస్తావించిన వీడియోను కూడా కిమ్మెల్ షేర్ చేశారు. ఈ కేసుకు సంబంధించి ఎఫ్‌బీఐ డైరెక్టర్ క్యాష్ పటేల్‌పై కూడా కిమ్మెల్ విమర్శలు గుప్పించారు అంశంపై వివాదం రేగడంతో ఏబీసీ సంస్థ షేర్ హెూల్డర్‌లలో ఒకరైన నెక్స్‌స్టార్ సంచలన ప్రకటన చేసింది. జిమ్మీ కిమ్మెల్ షోను ఇకపై ప్రసారం చేయబోమని పేర్కొంది. కిమ్మెల్ కామెంట్స్ అభ్యంతరకరమని వ్యాఖ్యానించింది. ఈ సున్నిత సమయంలో ఇలాంటి కామెంట్స్ చేసుండాల్సింది కాదని అభిప్రాయపడింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాల విమర్శకుల్లో జిమ్మీ కిమ్మెల్ కూడా ఒకరు. గతంలో మరో టీవీషో వ్యాఖ్యాత స్టీవెన్ కోబేర్ షో కూడా దాదాపు ఇలాగే రద్దైనవిషయం తెలిసి ందే. ఇదే తమ చివరి సీజన్ అనిషో ప్రొడ్యూసర్లు అప్పట్లో ప్రకటించారు.

## పాకిస్తాన్‌కు అండగా సౌదీ అరేబియా




**పాకిస్తాన్, మేకార్తి దినపత్రిక ,**

పాకిస్తాన్, సౌదీ అరేబియా కలిసి ఒక కీలకమైన రక్షణ ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందం పేరు స్ట్రాటజిక్ మ్యూచువల్ డిఫెన్స్ అగ్రిమెంట్. దీని ప్రకారం, ఒక దేశంపై దాడి జరిగితే, అది రెండో దేశంపై దాడిగా పరిగణిస్తారట అంటే, ఇకపై ఈ రెండు దేశాలు ఒకరికొకరు గట్టిగా సపోర్ట్ చేసుకోబోతున్నాయి. ఈ ఒప్పందంపై సౌదీ అరేబియా క్రౌన్ ప్రిన్స్ మహ్మద్ బిన్ సల్మాన్, పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మధ్య సంతకం జరిగింది. షెహబాజ్ షరీఫ్, క్రౌన్ ప్రిన్స్ ఆహ్వానం మేరకు సౌదీ అరేబియాకు వెళ్లారు. ఈ ఒప్పందం రెండు దేశాల మధ్య రక్షణ సహకారాన్ని మరింత బలోపేతం చేయడం, ఏదైనా దాడిని ఎదుర్కొనేందుకు ఉమ్మడిగా సన్నద్ధం కావడం లక్ష్యంగా పెట్టుకుంది. ఇటీవల ఇజ్రాయెల్.. ఖతార్ రాజధాని దోహాలో హమాస్ నాయకులపై వైమానిక దాడి చేసింది. ఈ దాడిని అమెరికా ఏకపక్ష దాడి అని విమర్శించింది. అమెరికా, గల్ఫ్ దేశాలకు ఎప్పటి నుంచో రక్షణ కవచంలా ఉంటోంది. కానీ ఈ దాడి వాళ్ల ప్రయోజనాలకు వ్యతిరేకమని చెప్పింది. ఈ నేపథ్యంలో పాకిస్తాన్-సౌదీ ఒప్పందం ఆసక్తికరంగా మారింది.

ఈ ఒప్పందం వెనుక మరో కీలక నేపథ్యం ఉంది. కొన్ని నెలల క్రితం, భారత్-పాకిస్తాన్ మధ్య నాలుగు రోజుల సైనిక ఘర్షణ జరిగింది. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రవాద దాడిలో 26 మంది మరణించారు. ఈ దాడికి పాకిస్తాన్‌తో సంబంధాలున్న ఉగ్రవాదులు కారణమని తేలడంతో, భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ పేరుతో ప్రతీకార దాడులు చేసింది. ఆ ఘర్షణతో చివరికి పాకిస్తాన్ డీజీఎంఓ, భారత డీజీఎంఓతో మాట్లాడి ఆపేసింది. మరోవైపు ఇజ్రాయెల్ గత వారం హమాస్ రాజకీయ నాయకులను లక్ష్యంగా చేసుకుని దోహాలో దాడి చేసింది. ఈ దాడిలో ఆరుగురు మరణించారు. అందులో ఖతార్ భద్రతా దళాల సభ్యుడూ ఉన్నారు. ఖతార్ ఈ దాడిని ఉగ్రవాదం అని తీవ్రంగా ఖండించింది. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కార్యాలయం, ఈ దాడి పూర్తిగా స్వతంత్ర నిర్ణయమని, హమాస్ ఉగ్రవాద నాయకులనే లక్ష్యం చేసుకుని చేసినట్లు చెప్పింది. ఖతార్, అమెరికా కూడా ఒక మెరుగైన రక్షణ సహకార ఒప్పందం కుదుర్చుకునే పనిలో ఉన్నాయని అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో చెప్పారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాత్రం, ఇజ్రాయెల్ దాడి గురించి తనకు ముందస్తు సమాచారం ఇవ్వలేదన్నారు.

మేకార్తి దినపత్రిక

19- 09 - 2025 శుక్రవారం

# ఇంటర్‌లో ఉత్తీర్ణత మరింత పెరగాలి





ఇంటర్ లో ఉత్తీర్ణత మరింత పెరగాలి

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి చదివించాలి

అన్ అకాడమీ క్లాసెస్ సద్వినియోగం చేసుకోవాలి

యూ డైస్, ఎఫ్ ఆర్ ఎస్ పూర్తి చేయాలి

రెసిడెన్షియల్ విద్యాలయాల్లో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలి

కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

ఇంటర్ విద్య పై జిల్లాలోని ప్రభుత్వ, గురుకుల సంక్షేమ,ఇతర కళాశాలలపై సమీక్ష సమావేశం

**మేకార్తి దిన పత్రిక సెప్టెంబర్ సిరిసిల్ల ప్రతినిధి**


జిల్లాలోని అన్ని ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణత మరింత పెరగాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. ఇంటర్మీడియట్ విద్య, రానున్న పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయడం, వివిధ అంశాలపై జిల్లాలోని ప్రభుత్వ జూనియర్, సోషల్, బీసీ, ట్రైబల్, మైనార్టీ సంక్షేమ కళాశాలలు, టీజీ రెసిడెన్షియల్, మోడల్ స్కూల్, కేజీబీవీ కళాశాలల ప్రిన్సిపాళ్లతో గురువారం కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లాలో ఎన్ని ప్రభుత్వ కళాశాలలు ఉన్నాయి? ఎందరు విద్యార్థులు చదువుతున్నారో జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారిని ఆరా తీయగా, మొత్తం 42 ప్రభుత్వ, 06 ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ఉన్నాయని, ఇంటర్ ఫస్ట్ ఇయర్ లో 4302, సెకండ్ ఇయర్ లో 3874 మంది మొత్తం 8176 మంది విద్యార్థులు చదువుతున్నారని కలెక్టర్ దృష్టికి డీఐఈఓ తీసుకెళ్లారు. అనంతరం అన్ని కళాశాలల్లో గత ఏడాది ఎంత మంది విద్యార్థులు పాస్ అయ్యారో.. కళాశాల వారిగా సమీక్షించారు. ఉత్తీర్ణత తక్కువ ఉన్న కళాశాలల ప్రిన్సిపాళ్ల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కళాశాలల్లో యూ డైస్, ఎఫ్ ఆర్ ఎస్ వచ్చే వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని రెసిడెన్షియల్ కళాశాలల్లో ఆవరణ నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు.

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, అన్ని సబ్జెక్టులపై పట్టు వచ్చేలా తీర్చిదిద్దాలని, గత ప్రశ్న పత్రాలు తీసుకొని విద్యార్థులతో ప్రాక్టీస్ చేయించాలని, అన్ అకాడమీ తరగతులు సద్వినియోగం చేసుకోవాలని ఆదేశించారు. రానున్న పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచేలా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని సూచించారు. జిల్లా ఇంటర్ విద్యాధికారి ప్రతి కళాశాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. అటవీ జంతువులు, కోతులతో ఇబ్బందులు ఎదురవుతున్న విద్యాలయాల బాధ్యులు సోలార్ ఫెన్సింగ్ కోసం జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. అవసరమైన మేర వాటిని అందజేస్తామని కలెక్టర్ తెలిపారు.

సమావేశంలో జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి శ్రీనివాస్, ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కుక్కకాటు కలకలం



**మేకార్తి దిన పత్రిక సెప్టెంబర్ సిరిసిల్ల ప్రతినిధి**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని వీధుల్లో ఓ పిచ్చికుక్క స్వైర విహారం చేస్తూ అందరిని కరుస్తూ వస్తుంది వెంకట్రావు నగర్ ఇందిరానగర్ కొత్త బస్టాండ్ ఏరియాలో దాదాపు 70 మంది పైగా కరిచింది పట్టణ ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కోరుతున్నారు

# కాంగ్రెస్ అలసత్వం కరీంనగర్ నియోజకవర్గానికి శాపంలా మారింది



**మేకార్తి దిన పత్రిక కరీంనగర్**

కాంగ్రెస్ అలసత్వం కరీంనగర్ నియోజకవర్గానికి శాపంలా మారింది. పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని ఆశల పల్లకి ఎక్కించిన సర్కారు, ఆ తర్వాత చోద్యం చూస్తున్నది. కరీంనగర్ రూరల్ మండలంలో పైలెట్ గ్రామం బహదూర్‌ఖాన్‌పేట మినహా 13 గ్రామాల్లో ఒక్కటంటే ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయకపోవడం నిర్లక్ష్యానికి అద్దంపడుతున్నది. ఖాళీ స్థలం ఉంటేనే ఇల్లు వస్తుందనే మాటలతో ఎంతో మంది శిథిలావస్థలో ఉన్న నివాసాలను కూల్చుకొని నెలల తరబడి నిరీక్షిస్తూ, కిరాయికి ఉండాల్సిన దుస్థితి దాపురించింది. ఇందిరమ్మ కమిటీలు లేకపోవడమే అందుకు కారణమని తెలుస్తుండగా, యంత్రాంగం ఇప్పటికైనా స్పందించి గూడు గోస తీర్చాలనే డిమాండ్ వినిపిస్తున్నది.

కరీంనగర్ రూరల్, సెప్టెంబర్ 17: కరీంనగర్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం పేదలు ఎదురుచూస్తున్నారు. నెలల తరబడిగా నిరీక్షిస్తున్నారు. గూడు లేని ప్రజలకు ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5లక్షలు ఇస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కరీంనగర్ రూరల్ మండలంలోని పేద ప్రజలు తమ సొంతింటి కల నెరవేరుతుందని సంబురపడ్డారు. ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాలు నిర్వహించగా, మండలంలో 14 గ్రామాల నుంచి మొత్తం 9వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. లబ్ధిదారుల ఎంపిక కోసం అధికారులు సర్వే చేశారు. అందులో 3,119 మందిని అర్హులుగా గుర్తించారు. అయితే ఇందిరమ్మ కమిటీలు లేకపోవడంతో ఇప్పటివరకు పైలెట్ గ్రామం బహదూర్‌ఖాన్‌పేట మినహా మరే గ్రామంలో ఏ ఒక్కరికీ ప్రొసీడింగ్ పత్రాలు అందజేయలేదు. బహదూర్‌ఖాన్‌పేటలో 106 మందికి మంజూరు చేయగా, ప్రస్తుతం 66 ఇండ్లు నిర్మాణంలో ఉండగా, మిగతా గ్రామాల్లో మాత్రం ఎదురుచూపులే మిగిలాయి. సర్వే సమయంలో ఖాళీ స్థలం ఉంటేనే ఇల్లు మంజూరవుతుందనే నిబంధనతో చాలా మంది పేదలు తమ పాత ఇండ్లు, శిథిలావస్థలో ఉన్న వాటిని కూల్చివేసుకున్నారు.

చెర్లభూత్కూర్‌లో 20 మంది, నగునూర్‌లో 22 మంది, మొగ్దుంపూర్‌లో 16 మంది, ఆయా గ్రామాల్లోనూ పలువురు ప్రొసీడింగ్‌లు రాకముందే డిస్మెటల్ చేసుకొని ఇండ్ల కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి, మంత్రులను కలిసి విన్నవిస్తే.. 'ఇదిగో వస్తుంది.. అదిగో వస్తుంది' అనడం తప్ప వచ్చేది లేదు, ఇచ్చేది లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రొసీడింగ్‌లు ఇప్పించాలని కోరుతున్నారు. కాగా, ఇందిరమ్మ కమిటీల నియామకం జరిగితేనే ఇండ్ల మంజూరు పత్రాలు లబ్ధిదారులకు అందజేసే వీలుంటుందని గృహనిర్మాణ సంస్థ అధికారులు చెబుతున్నారు.

ఇల్లు కూల్చి రేకుల షెడ్డుల ఉంటున్నం

మాది పేద కుటుంబం. ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నం. ఇండ్ల జాబితాలో పేరు వచ్చిందన్నరు. చాలా సంతోషమనిపించింది. ఖాళీ స్థలం చూపిస్తేనే ఇల్లు మంజూరైతదని అధికారులు అన్నరు. ఊళ్లో చాలా మంది పాత ఇంటిని తీసేస్తున్నరని తెలిసి మా ఇంటిని కూల్చుకున్నం. ఐదు నెలలైతంది. ఇల్లు ఇయ్యలే. రేకుల షెడ్డు వేసుకొని ఉంటున్నం. అధికారులు కనికరించి ప్రొసీడింగ్ పేపర్ ఇయ్యాలె.

# సైబర్ నేరాల నియంత్రణే లక్ష్యంగా

## సైబర్ వారియర్లు పని చేయాలి



**మేకార్తి దినపత్రిక సిరిసిల్ల ప్రతినిధి సిరిసిల్ల ప్రతినిధి**

జిల్లాలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, మోసపూరిత ఆన్‌లైన్ కార్యకలాపాలను అరికట్టడం, తక్షణ చర్యల ద్వారా బాధితులకు న్యాయం చేయడం వంటి అంశాల్లో కృషి చేసినసైబర్ సెల్ ఆర్.ఎస్.ఐ జునైద్, శ్రీకాంత్ డిస్ట్రిక్ట్ సైబర్ క్రైమ్,రాజశేఖర్ వేములవాడ రూరల్, వెంకటరమణ సిరిసిల్ల టౌన్‌లకు ప్రశంశ పత్రాలు, ప్రోత్సాహకాలు అందించిన జిల్లా ఎస్పీ ఈసందర్భంగా జిల్లా ఎస్పీమాట్లాడుతూ. సైబర్ క్రైమ్ దర్యాప్తులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం అత్యంత కీలకమని,భవిష్యత్‌లో మరింత నైపుణ్యంతో కేసులు పరిష్కరించేలా సైబర్ వారియర్లను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.సైబర్ నేరాలకు గురైన బాధితులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి పోలీస్ స్టేషన్లో నియమించబడ్డ సైబర్ వారియర్స్ సైబర్ నేరాలపై వచ్చే పిర్యాదులపై తక్షణమే స్పందించి కేసులు నమోదు చేయాలని, సైబర్ నేరగాళ్ల ద్వారా మోసపోయిన వ్యక్తులు డబ్బు బ్యాంకులో ఫ్రీజ్ అయి ఉన్నట్లయితే వీలైనంత త్వరగా డబ్బులు తిరిగి వచ్చే విధంగా కృషి చేయాలన్నారు.అనుకోని రీతిలో ఎవరైనా సైబర్ నేరానికి గురైతే ఖంగారు పడకుండా వెంటనే 1930 ఫోన్ నెంబర్ కు,%చీజ్రా జూశీతీఖ్రీ% గాని,దగ్గర్లోని పోలీస్ స్టేషన్లో ఉన్న సైబర్ వారియర్ ని సంప్రదించాలని ఎస్పీ తెలిపారు.

# ఆది శ్రీనివాస్ జన్మదిన సంబరాలు




**మేకార్తి దినపత్రిక వేములవాడ**

వేములవాడ నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాల్లో స్థానిక శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వందేళ్లు ఆయురారోగ్యాలతో ప్రజా ప్రతినిధిగా అభివృద్ధిలో తోడ్పడాలని నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు న్యాత నవీన్ ఆకాంక్షించారు. గురువారం ఆది శ్రీనివాస్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలో సుమారు 200 మంది యువకులతో కలిసి తిప్పాపూర్ బస్టాండ్ నుంచి కోరుట్ల బస్టాండ్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ హాజరై తన జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం న్యాత నవీన్ మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యున్నతమైనటువంటి పదవులను అధిరోహించి రాష్ట్రాన్ని శాశించే స్థాయికి ఆది శ్రీనివాస్ ఎదగాలని ఆయన కోరుకున్నారు.యూత్ కాంగ్రెస్ కు నియోజకవర్గంలో ఎల్లవేళలా సహకరిస్తూ అహర్నిశలు శ్రమిస్తున్నారని ఆయన గుర్తు చేశారు. జన్మదిన వేడుకలను అంబరాన్ని అంటేలా నిర్వహించిన న్యాత నవీన్ ను ఆది శ్రీనివాస్ ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.భారీ బైక్ ర్యాలీ నిర్వహించి విజయవంతం చేసిన యూత్ కాంగ్రెస్ పార్టీ నేతలకు న్యాత నవీన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ పార్టీ వివిధ మండలాల అధ్యక్షులు,కార్యవర్గ సభ్యులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# ఆది శ్రీనివాస్ జన్మదిన వేడుకలు



**మేకార్తి దినపత్రిక సెప్టెంబర్ ముస్తాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలోని. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుక్షణం ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా నాయకుడిగా గుర్తింపు తెచ్చుకొని ప్రజల కోసం పరితపించే నాయకుడు ఆది శ్రీనివాస్ అన్నారు వేములవాడ రాజన్న ఆలయ అభివృదే లక్ష్యంగా పనిచేస్తూన్న ఆది శీనన్నకు ఆ రాజన్న ఆశీస్సులు నిండుగా ఉండి ఇలాంటి జన్మదిన వేడుకలను మరెన్నో జరుపుకోవాలని ఆయురారోగ్యాలతో విరాజిల్లాలి అని మండల కాంగ్రెస్ పార్టీ తరఫున కోరుకుంటున్నాము అన్నారు ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజ్జల రాజు మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి రాణి నర్సింలు సీనియర్ నాయకులు జిల్లా నాయకులు మండల నాయకులు వివిధ గ్రామ శాఖ అధ్యక్షులు మహిళా విభాగం విద్యార్థి విభాగం యూత్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

PRINTED,PUBLISHED & OWNED BY MEKARTHI SRINIVAS, Pri- ted at SUNDAY PRINTING PRESS, H.No. 3-4297, SARASWATHI COMPLEX,SVN COLONY GUNTUR,ANDHRA PRADESH-522006.& Published from H.No. 12-166, RAJIV NAGAR,MUSTABAD, RAJANNA SIRICILLA DISTRICT-505404 TELANAGNA,. RNI No.TGTEL /25/A2356,Editor : MEKARTHI SRINIVAS, Cell: 9014726022.e-mail: MEKARTHI DINAPATRIKA@gmail.com